www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 28 జులై 2023



క్రికెట్ స్టేడియం పనులు ముమ్మరం

ప్రజాశక్తి-రాయచోటి

క్రికెట్ స్టేడియం పనులను ముమ్మరం చేయాలని కలెక్టర్ గిరీష అన్నారు. గురువారం మండలంలోని దిగువ అబ్బవరం గ్రామ పంచాయతీ నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం భూమి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, రోడ్డు నిర్మాణం, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు చేయాలని అవకాశాలు తదితరాలపై రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రికెట్ స్టేడియం అభివృద్ధి వేగవంతం చేయాలని, త్వరితగతిన నాణ్యతగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్టేడియం చుట్టూ, స్టేడియం రోడ్డు కిరువైపులా చెట్లు నాటే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి జిల్లా అధికారి సహదేవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, తహశీల్దార్ హేమంతకుమార్, రెవెన్యూ ఆర్అండ్‌బి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'సెయిల్' ఉక్కుకు సమాధి

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- స్పందించని అధికార, ప్రతిపక్ష పార్టీలు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిపిఎం పిలుపు



ప్రజాశక్తి- కడప ప్రతినిధి/యంత్రాంగం

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రంలోని బిజెపి సర్కారు సమాధి కట్టింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలురకాల సర్వేలు, టాస్క్‌ఫోర్స్‌ల పేరుతో అధ్యయనాలు చేయించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం పార్లమెంటులో టిడిపికి చెందిన ఇద్దరు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి నిత్యానందరాయ్ సర్వే సంస్థలు లాభసాటి కాదని తేల్చాయని, ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం కుదరదని కుండబద్దలు కొట్టినట్లు సమాధానం చెప్పడం విస్మయాన్ని కలిగించింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో ప్రయివేటు రంగంలో బ్రహ్మణీ పేరుతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ రకాల కారణాలతో బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమ నిలిచిపోయింది. రాష్ట్రంలో నాయకత్వ బాధ్యతలు మారడంతో బ్రహ్మణీ పరిశ్రమ కథ కంచికి చేరింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర విభజన హామీలు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానాంశాలుగా మారడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు నిర్లక్ష్యం వెరసి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి సర్కారు అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వైసిపి అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు చేశారు. ఇందులోభాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ ఉక్కు దిగ్గజ సంస్థ జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిపిఎం పిలుపనిచ్చింది.

స్పందించని వైసిపి, టిడిపి, జనసేన

కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేనలు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఉమ్మడిగా కూడబలుక్కుని తోడుదొంగలుగా మారినట్లు ప్రవర్తించడం శోచనీయం. ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేనలు ప్రజల తరుపున నిలబడకుండా మోడీ, అమిత్‌షా, గుజరాతీ వ్యాపారుల పక్షాన నిలబడడం ఆందోళనకరం.

కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యమా

దేశంలోని ప్రయివేటు, కార్పొరేట్లకు లాభసాటిగా కనిపించిన ఇనుప ఖనిజం ఎగుమతులు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెయిల్‌కు ఎందుకు లాభసాటిగా కనిపించడం లేదనే చర్చ నడుస్తోంది. కేంద్రంలో బిజెపి పభుత్వం ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంపై చిన్నచూపు చూస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహపూరిత వైఖరి పట్ల ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కేంద్రం పచ్చి అబద్దాల కోరు



కేంద్రంలోని బిజెపి సర్కారు సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఫీజుల బులిటీ లేదనడం పచ్చి అబద్ధం. ఐరన్‌ఓర్‌తోపాటు ఉక్కు తయారీలో కీలక పాత్ర పోషించే సున్నం, నికెల్, డోలమైట్ వంటి కీలక మూలకాలు సైతం జిల్లాలో లభ్యమవుతుంది. దేశంలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఐరన్‌ఓర్ లేదు. కలకత్తాలోని బిలాయ్ ఉక్కు కర్మాగారం సమీపంలోనూ ఐరన్‌ఓర్ లేదు. ఫీజుబులిటీ లేకపోతే విశాఖ మొదలుకుని బ్రహ్మణీ, జెఎస్‌డబ్ల్యూలకు ఎలా లాభాలు వస్తాయని నిర్మాణాలు చేపట్టారో ప్రజానీకం అర్థం చేసుకోవాలి. కేంద్రం తరుపున ఎవరైనా డిబేట్‌కు వస్తే సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో మొదటి గ్రేడ్ ఐరన్‌ఓర్ 75 నుంచి 70, 40 రకాలుగా గ్రేడ్ క్వాలిటీ వరకు లభిస్తోంది.

- బి.నారాయణ, ఉక్కు సాధన కమిటీ కన్వీనర్, కడప.

ఇది ఒక మోసపూరిత ఎత్తుగడ



కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి వయబులిటీ లేదనడం ఓ మోసపూరిత ఎత్తుగడ. జపాన్‌లో బిగ్‌హెడ్స్ (ఉక్కు గనులు) లేకపోయినప్పటికీ ఓబుళాపురం ఐరన్ ఓర్‌ను తీసుకుని క్వాలిటీ ఐరన్ ఉత్పత్తులు చేయడం జరుగుతోంది. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేమని చెప్పడం దారుణం. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు రాష్ట్ర ప్రజల వైపా, మోడీ, షా, గుజరాతీ వ్యాపారుల వైపా అనేది తేల్చుకోవాలి. కేంద్ర మోసపూరిత వైఖరికి నిరసనగా రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నాం.

- చలసాని శ్రీనివాస్, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్, విజయవాడ.

తీరని ద్రోహం



కడపలో స్టీల్ ప్లాంట్‌కు ఇప్పటిదాకా ముగ్గురు ముఖ్య మంత్రులు నాలుగుసార్లు శంకు స్థాపనలు, భూమి పూజలు చేశారు. యుపిఎ, ఎన్‌డిఎ రెండూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న విభజన హామీని నెరవేర్చకుండా జిల్లాను మోసం చేశాయి. కేంద్రం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదంటోంది. పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అన్ని రాజకీయ పార్టీల హామీ, దాన్ని సాకారం చేయడం విభజనవాదుల అందరి బాధ్యత. జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకపోతే కేంద్రం లోని ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం తగిన మూల్యం చెల్లించక తప్పదు.

-ఎ.రఘునాథరెడ్డి, కడప

ఎపి పట్ల చిన్నచూపే



మొదటి నుంచి కేంద్రంలోని బిజెపి సర్కారుకు రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తోంది. కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే కారణం. రాయలసీమ డిక్లరేషన్ పేరుతో చెప్పిన మాటలు గాలికి పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటీవల పురంధేశ్వరి సైతం మోసపూరిత మాటలే మాట్లాడడం ఆందోళనకరం. పార్లమెంటులో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయింది. ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎటువంటి ముడిసరుకులు లేకపోయినా ఏర్పాటు చేసి, అన్ని వనరులు కలిగిన కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

- సి.హెచ్.చంద్రశేఖర్‌రెడ్డి, కార్మిక, కర్షక ఉద్యమ నాయకులు, కడప.

ఫీజుబులిటీ పేరుతో ద్రోహం



రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చే అవకాశం కలిగిన ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఫీజుబులిటీ లేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహం చేస్తోంది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రధాన హామీకి నిలువునా తూట్లు పొడిచింది. దేశంలో ఐరన్‌ఓర్ లభ్యతకు వందలాది కిలోమీటర్ల దూరంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం లాభదాయకమైనది. ఐరన్ ఓర్‌తోపాటు నికెల్, డోలమైట్ ఇతర ఖనిజాలు కలిగిన ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి వయబులిటీ కాదనడం దారుణం.

జి.చంద్రశేఖర్, సిపిఎం, జిల్లా కార్యదర్శి, కడప.

చావు కబురు చల్లగా..



కడప ఉక్కు కర్మాగారంపై కేంద్రం వాలకం చావు కబురు చల్లగా చెప్పినట్లు ఉంది. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు అన్ని హంగులతో పాటు వనరులు సమృద్ధిగా ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పాలనలో కడప ఉక్కు కర్మా గారం బుట్టదాఖలైందని. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం, షెడ్యూల్ 13 ప్రకారం కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాలో సెల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం 6నెలల లోపు నిర్మించాల్సి ఉంది. తొమ్మిదిన్నర సంవత్సరాలైన అతీగతి లేదు. రాష్ట్రానికి బిజెపి ఒక శనిగ్రహం లాగా దాపురించిందని చెప్పారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా ఉక్కు కర్మాగారంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్, కడప.

రాయలసీమకు ద్రోహం చేసిన బిజెపి



కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించి రాయలసీమకు ద్రోహం చేసింది. విభజన చట్టంలో భాగంగా రాయలసీమ అభివద్ధికి ప్రత్యేక నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్థాపించాల్సి ఉంది. బిజెపి ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా వీటిని అమలు చేయకుండా రాయలసీమకు తీరని ద్రోహం చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా పార్లమెంటులో ప్రకటన చేస్తుంటే రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు మాట్లాడకుండా కూర్చోవడం బిజెపికి సాగిలపడటమే.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

ప్రజలు తగిన బుద్ధి చెబుతారు



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కడప జిల్లాలో విభజన హామీ మేరకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని పార్లమెంటులో నాయకులు బల్ల బుద్ధి చెప్పారు. అధికారంలోనికి వచ్చి 9 సంవత్సరాల అవుతున్న స్టీల్ ప్లాంట్‌పై స్పష్టమైన వైఖరి ప్రకటించలేదు. కేంద్ర సహాయ మంత్రి కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయము అని ప్రకటించడం ప్రజలను మోసగించడమే. తగిన సమయంలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారు.

- సయ్యద్ సలావుద్దీన్, సంఘ సేవకలు, కడప.

విభజన హామీలకు తిలోదకాలు



ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం జిల్లావ్యాప్తంగా పార్టీలకతీతంగా ప్రజలు ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున సాగించిన పోరాటానికి నాటి యుపిఎ ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చింది. అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చింది. ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కువ పార్లమెంట్ స్థానాలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కడప ఉక్కు పరిశ్రమ తీసుకువస్తామన్నారు. స్వార్థ రాజకీ యాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టారు. ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవస రమైన మౌలిక వసతులు కేంద్రానికి కనిపించకపోవడం దుర్మార్గం

-చంద్ర, జిల్లా కార్యదర్శి, సిపిఐ, కడప.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం సమానంగా ప్రాధాన్యతిస్తుందని, ఆ దిశగా సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బజారు వీధి, ఎల్ఆర్ వీధి, తిరుచుట్టు వీధుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు చూడకుండా, చివరకు తమకు ఓటు వేశారా లేదా అనేది కూడా చూడకుండా పేదరికమే కొలబద్ధగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి దేశంలోనే గన్మోహన్‌రెడ్డి మాత్రమే నన్నారు. విద్యా, వైద్య రంగాల్లో ఊహించని రీతిలో సంస్కరణలు, అభివృద్ధి పనులను చేపట్టి విప్లవాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి దశాబ్దాలుగా పేద రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించి భూయజమానులకు సంపూర్ణ హక్కును కల్పించడం వైసిపి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని, ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజలకు ఉపశమనం కలిగిందన్నారు. గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలలో ఐదు శాతం కూడా నెరవేర్చకపోవడం గమనార్హమని, మళ్లీ ప్రజల్ని ఏమార్చేందుకు మాయ మాటలతో కూడిన మేనిఫెస్టోలను టిడిపి తీసుకువస్తోందన్నారు. వెన్నుపోటు, మోసాలకు సామ్రాట్ అయిన చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఇఒ ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, నరసింహులు, రవి నాయక్, నీళ్ల భాస్కర్, శ్రీధర్ రాయల్, కువైట్ శంకరాచారి పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

1న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆగస్టు 1న చేపట్టనున్న మున్సిపల్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి పురపాలక కార్యాలయంలో మేనేజర్ శేషఫణికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించుకుంటామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోయారని విమర్శించారు. సిపిఎస్ పరిష్కరించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఒకటవ తేదీ నుంచి సమ్మెలోకి దిగనున్నట్లు తెలిపారు. ఆగస్టు ఏడవ తేదీన మునిసిపల్ కార్మికులతో చలో రాయచోటి ధర్నా కార్యక్రమానికి కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.ఓబయ్య, కె.ప్రసాద్, కోశాధికారి డి.లక్ష్మీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు

మదనపల్లె అర్బన్: మండలంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వేరుశనగకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు చేసుకోవాలని ఎఒ నాగప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉలవ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. జులై నెలాఖరు వరకు వేరుశనగ విత్తు కొనే వారు 15 రోజులు తేమ ఉండే విధంగా వర్షం పడితేనే విత్తనాలు వేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఆగస్టులో కంది, రాగి, అలసందలు, పెసర, మినుములు వేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 15 తరువాత ఉలవలు సాగుకు అనువుగా ఉంటుందని తెలిపారు. జులై నెలలో మండలంలో 62 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మండలానికి 370 క్వింటాళ్ల ఉలవలు సబ్సిడీతో రైతులకు ఇవ్వడం కోసం ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపినట్లు వెల్లడించారు.

విద్యార్థులకు వరం విదేశీ విద్యా దీవెన : కలెక్టర్



విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జడ్పీచైర్మన్, జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న విదేశీ విద్యా దీవెన విద్యార్థుల పాలిట వరమని కలెక్టర్ గిరిష తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన లబ్దిదారుల ఖాతాలలో బటన్ నొక్కే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరిషా పి.ఎస్, ఉమ్మడి జిల్లాల జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యా దీవెన పేద విద్యార్థులకు వరం లాంటిదని, ఇలాంటి విద్యా సంబంధిత పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాక్షించారు. విదేశీ విద్యా సంస్థల్లో చదువుకోవాలన్న కోరిక ఉన్న వారికి జగనన్న విదేశీ విద్యా దీవెన దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 2022-23 సంవత్సరానికి సంబంధించి 9 మంది విద్యార్థులు, 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇద్దరు విద్యార్థులు మొత్తం 11 మంది విద్యార్థులకు రూ. ఒక కోటి 51 లక్ష 86 వేల లబ్దిదారుల ఖాతాలో నగదు జమ చేశామన్నారు. పోటీతత్త్వంలో నిలదొక్కుకోవాలంటే మంచి యునివర్సిటీలో చదవాలన్నారు. అమెరికాలోని సిలికాన్ సిటీలో 40 నుంచి 50 శాతం తెలుగు వారే ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమ కలలను కూడా సాకారం చేసుకోవాలన్నారు. మంచి ఉన్నతమైన చదువులు చదివేందుకు రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి ఎప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు ముఖ్యమంత్రి తీసుకొచ్చారన్నారు. అమ్మ ఒడి నుంచి జగనన్న కానుక, తదితర పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. విదేశీ విద్యా దీవెన పథకం కింద ఎంపికైన విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థీ చదవాలనే తలంపుతో రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్షలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఎంబిఎ, ఎంసిఎలు ఉన్నత చదువులు అభ్యసించడానికి కారకులయ్యారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ మాట్లాడుతూ జగనన్న విదేశా విద్యానను ప్రతి విద్యార్థీ సద్వినియోయం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులకు మెగా చెక్కును కలెక్టర్, జడ్‌పి చైర్మన్లు, జెసిలు అందజేశారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని చిన్నమండెం, సంబేపల్లి మండలాల అంగన్వాడీ వర్కర్లకు గ్యాస్ స్టవ్ లిచ్చి గ్యాస్ సిలిండర్లు ఇవ్వకపోతే పిల్లలకు, గర్భిణులకు అన్నం ఎలా వండి పెడతారని అధికార యంత్రాంగాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రశ్నించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు బి.నాగమణి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ప్రయవేటీకరణ చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు ఫేస్‌యాప్‌ను తెచ్చాయని చెప్పారు. కార్యకర్తలకు సెల్‌ఫోన్లు లేవని, ఈ ఫోన్లు గ్రామీణ ప్రాంతాల్లో సరిగ్గా పని చేయడం లేదని వాపోయారు. రకరకాల యాప్‌లతో పనిభారం అధికమైందని చెప్పారు. వాటి నుంచి అంగన్వాడీలకు ఉపసమనం కల్గించాలన్నారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించడం కొత్త అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వర్కర్ల కు వేతనాలు, చిన్నారులకు ఆడుకునే కిట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. దేవపట్ల శెట్టిపల్లి సెక్టార్ల వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు 2022 అక్టోబర్ జీతం ఇప్పటికీ ఇవ్వకపోవడంతో శోచనీయమన్నారు. దీనిపై విదచారించి బాధ్యులపై చర్యలు తీసుకొని పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్లకు కొన్ని చోట్ల స్టవ్‌లు మాత్రమే ఇచ్చారని మరి కొన్ని చోట్ల సిలిండర్లు ఇచ్చారని వాపోయారు. సిఎఫ్ఎంఎస్ పేరుతో 90 మంది కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 31 న ప్రాజెక్టు కార్యాలయం వద్ద వర్కర్లందరూ స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.బంగారుపాప, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.ఖాజాబీ, డి.విజయమ్మ, మండల ప్రధాన కార్యదర్శి ఎ.అరుణ, మండలంలోని వివిధ సెక్టార్లలోని అంగన్వాడీ, మినీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మణిపూర్ సిఎంను బర్తరఫ్ చేయాలి

- ప్రజా సంఘాల ధర్నాలో నాయకులు



నిరసన తెలుపుతున్న మహిళలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అమానుష అత్యాచారాలను ఖండిస్తూ ఐద్వా, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం మొదలగు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా గురువారం మదనపల్లె పట్టణం లో ఆందోళనలు చేపట్టారు. మోడీ మౌనం వీడాలి, దోషులను కఠినంగా శిక్షించాలి, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉంటే మున్ముందు మణిపూర్ లాంటి ఘటనలు ఇంకా ఎన్నో చూడాల్సి వస్తుందని తెలిపారు. అత్యంత క్రూరమైన ఘటనలు మణిపూర్లో జరిగాయని, బిజెపి ప్రభుత్వం వాటిని నివారించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. జరిగిన తీరును బట్టి చూస్తే ప్రభుత్వమే దగ్గరుండి ఘర్షణలు రెచ్చగొట్టినట్లు కనిపిస్తోందని తెలిపారు. అక్కడి వీడియోలను చూస్తుంటే హిట్లర్ యూదులను చంపినట్లు ఉందని అన్నారు. మణిపూర్ ఘటనలో దీరెకాలిక కుట్రకోణం దాగుందని పేర్కొన్నారు. మెజారిటీ వర్గమైన మెయితీలను ఎస్‌సి, ఎస్‌టిల్లో చేర్చడానికి బిజెపి మేనిఫెస్టోలో పెట్టిందా? అని ప్రశ్నించారు. 55కు పైగా టెర్రరిస్టు గ్రూపులు ఉన్న ప్రాంతాల్లో అత్యంత సున్నితమైన నిర?యం తీసుకోబోయే సమయంలో ఆయుధ ఎఫ్ఎస్‌పిఎ చట్టాన్ని తీసేయడం ఉద్దేశం ఏమిటో చెప్పాలన్నారు. బలమైన వ్యవహారంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇవ్వడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వమే మైనార్టీ తెగమీద ఉద్దేశపూర్వక లక్ష్యంతో పనిచేసినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఓట్లకోసం మైనార్టీలను లక్ష్యంగా వాడుకుంటున్నారని తెలిపారు. గోద్రా అల్లర్లు కూడా ఇదే తరహాలో చేశారని, అక్కడ మతాలను విడగొట్టి రాజకీయంగా లబ్ధి పొందారని విమర్శించారు. దేశ ప్రధాని కాశ్మీర్‌ఫైల్స్, కేరళ ఫైల్స్ చూడండని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. తెగల మధ్య గొడవని, మతాల మధ్య గొడవగా చూపించడం అత్యంత నీచమని పేర్కొన్నారు. పార్టీలు మతాన్నో, వర్గాన్నో నెత్తినపెట్టుకుని పనిచేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి యం.భాగ్యమ్మ మాట్లాడుతూ మానవ సమాజం సిగ్గుపడేలా మణిపూర్‌లో దారుణాలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు, హింస పెరిగిపోతోందని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ మణిపూర్‌లో గత మూడు నెలలుగా మారణకాండ జరుగుతున్నా శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రధాని మోడీ మౌనం వహించడం దుర్మార్గమన్నారు. వెంటనే మణిపూర్‌లో ప్రశాంత వాతావరణం కల్పించాలని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మదనపల్లె ప్రాజెక్టు అధ్యక్షురాలు మధురవాణి, సిఐటియు నాయకులు సురేంద్ర, రిటైర్డ్ ఆర్జెడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

31న ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించి రాయలసీమకు ద్రోహం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్థాపించాల్సి ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా వీటిని అమలు చేయకుండా రాయలసీమకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని ఆ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షులు పురంధరేశ్వరిదేవి ప్రకటించిన మూడు రోజులకే కేంద్రలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని చెప్పడం ఆ పార్టీ నయవంచన విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కడపలో రాష్ట్రమే సొంతంగా కర్మాగారం నిర్మిస్తుందంటూ ఆర్భాటంగా శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకూ దానికి అతీగతి లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా పార్లమెంటులో ప్రకటన చేస్తుంటే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు మాట్లాడకుండా కూర్చోవడం బిజెపికి సాగిలపడటమేనని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్‌లో ఈ ప్రకటన చేస్తుండగా రాష్ట్ర ఎంపీలు మౌనంగా ఉండడం తెలుగుజాతికే అవమానమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 31న జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. నిరసన ధర్నా కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు, మేధావులు యువకులు పాల్గొని పాలకుల మెడలు వంచాలన్నారు. ధర్నాకు అందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



లబ్ధిదారులకు రేషన్‌కార్డు అందిస్తున్న కన్వీనర్ చాంద్‌బాషా


నూతన రేషన్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయం పరిధిలో రేషన్ కార్డులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకి కన్వీనర్ గుమ్మడి కాయలు చాంద్‌బాషా ప్రత్యేక చొరవతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశారు. గురువారం ఒకటో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మౌలా లబ్ధిదారులకు ఈ కార్డులను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల్లో ఒకరైన నాగభూషణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హత ఉన్న రేషన్ కార్డులు రాలేదని, ఈ ప్రభుత్వంలో రేషన్ కార్డు లేదని ఒకటో సచివాలయం కన్వీనర్‌కి తెలపడంతో ఈ విషయాన్ని మాజీ ఎంపిపి ఖలీల్‌అహ్మద్ దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డు మంజూరు చేయించారన్నారు. మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, చాంద్‌బాషా వైసిపి నాయకులు జనార్ధనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతున్నామన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ చాంద్ బాషా మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతివారికి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

30న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట రూరల్



డాక్టర్ నాగాంజనేయులు

ఈనెల 30న ఆదివారం శ్రీ బాలాజీ ఫిజియోథెరపీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీకి సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రత్యేక నరాల వైద్యులు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నాగాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగులుమానువీధిలోని శ్రీనివాస జువెలర్స్ ఎదురుగా గల తమ ఆస్పత్రిలో ఈ ఉచిత సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. పక్షవాతం, మెడనొప్పి, నడుము నొప్పులు, భుజము, మడమ నొప్పులు, కీళ్ళ అరుగుదల, కండరాల బలహీనత, కీళ్ళ సంబంధం గాయాలు, కాళ్లు-చేతులు తిమ్మిర్లు, మూతి వంకర, నరాల బలహీనత, పోలియో, అధిక బరువు వంటి సమస్యలతో పాటు ఎముకలు, కీళు,, నరాలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకించి మహిళా వైద్యురాలుచే చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట



రక్తదానం చేస్తున్న రమేష్

రాయచోటి మండలం బోయపల్లెకు చెందిన వీరబల్లి ఎర్రయ్యకు శస్త్రచికిత్స నిమిత్తం రక్తం అవసరం కాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ ఎన్.శాంతయ్యకు విషయం తెలుపుగా వెంటనే స్పందించిన శాంతయ్య రైల్వే కోడూర్ నియోజకవర్గం పుల్లంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిగ మాల రమేష్‌తో మాట్లాడి వెంటనే కడప బ్లడ్ బ్యాంక్‌కి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఒక ప్రాణం నిలబ డుతుందని, ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు రక్తదానం చేయడం చాలా మంచి దని అన్నారు. రక్తదానం చేయడంలో ఏ వ్యక్తి కూడా వెనకాడ వద్దని తెలిపారు.

రాయచోటి సమన్వయకర్తగా పూల భాస్కర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయచోటి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా తనను నియమించినట్లు రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, రాయలసీమ ఇన్‌ఛార్జి జంగాగౌతమ్‌లు తనకు ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పార్టీ తనపై విశ్వాసంతో తనకు అప్పజెప్పిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

రైల్వేకోడూరు కన్వీనర్‌గా అల్లాబకాష్..

రాయచోటి : కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.అల్లాబకాష్ సిఎల్‌పిని కోడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రాయచోటి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అల్లాబకాష్‌ను ఘనంగా సన్మానించారు. తనకు అవకాశాన్నినాకు కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా గౌతమ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మండలంలోని పివిజిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు సిద్ధవటం రెడ్డి ప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, దాసరి సుజితలను గురువారం పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయు రాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాలలో ఆంగ్లో ఉపాధ్యాయులు రెడ్డిప్రసాద్ రాజంపేట మండలం ఊటుకూరుకు, తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ పిజిటిగా, నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, గణిత ఉపాధ్యాయురాలు దాసర సుజిత, కడప జయనగర్ కాలనీ బాలికొన్నతో పాఠశాలకు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా యుల ముప్పల శివశంకర్‌రాజు, లక్కాకుల శ్రీనివాసులు, గోదిన గౌరీ దేవి, నూకల చంద్రకుమార్, హరనాథ్, జితేంద్ర, శ్యామ్ సుందర్, స్వర్ణలత, సుబ్బరాయుడు పాల్గొని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

దేశ నాయకుల చిత్రపటాలు బహూకరణ

పుల్లంపేట : మండలంలోని పివిజిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు పిజిటిగా బదిలీపై వెళ్లిన గంగనపల్లి వెంకటరమణకు ప్రముఖ కవులు, సాహితీవేత్తల చిత్రపటాలను పాఠశాలకు బహుకరించారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయులు సమక్షంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణికి అందించారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు, ప్రముఖ కవులు శ్రీకృష్ణ దేవరా యలు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ వెంకట అప్పారావు, గుర్రం జాషువా, ఆతుకూరి మొల్ల, శ్రీరంగం శ్రీనివాసరావు, పింగళి వెంకయ్య, పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటాలను అందించారు.

వీరబల్లి ఎంఇఒగా రామకృష్ణుడు

వీరబల్లి : రామాపురం విద్యా శాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణుడును వీరబల్లి ఎంఇఒ-1 గా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ ఉన్నత అధికారులు తనపై నమ్మకంతో ఇన్‌ఛార్జి ఎంఇఒగా నియమించి ఇక్కడికి పంపినట్లు చెప్పారు. తన పదవీ బాధ్యతలు న్యాయబద్ధంగా, విధి నిర్వహణలో ఎటువంటి తప్పులు జరగకుండా విద్యా వ్యవస్థను మంచి మార్గంలో నడిపిస్తానన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు ఆయనను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

- విశ్రాంత జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి



బ్యాంకు ప్రారంభోత్సవంలో విశ్రాంత జస్టిస్ నాగార్జునరెడ్డి

నూతనంగా ఏర్పాటైన ఎస్‌బిఐ బ్యాంకు సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మారుమూల గ్రామమైన గడికోట గ్రామంలో ఎస్‌బిఐ కార్యాలయాన్ని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎపిఎస్‌పిడిసిఎల్ ఎండి కమలాకర్ బాబు, ఎన్‌ఆర్‌ఇడిసి ఎపిఎండి రమణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంతి జస్టిస్ నాగార్జునరెడ్డి చొరవతో గడికోట గ్రామానికి ఎస్‌బిఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. గడికోట, యడబల్లి నుంచి గురుస్వామి దేవాలయం వరకు సిసి రోడ్డును ప్రారంభించారు. అక్కడికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పెద్దలకు శాలువాలు కప్పి సన్మానించారు. మారుమూల గ్రామానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం రావడంతో అక్కడ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మదన్ రెడ్డి, ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లేశ్వరి, రీజనల్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పక్కాగా ఉండాలి : డిఎల్‌డిఒ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డిఎల్‌డిఒ లక్ష్మీపతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థుల జిఇఆర్ పక్కాగా ఉండాలని, వంద శాతం పూర్తి చేయాలని మదనపల్లి డిఎల్‌డిఒ లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శేషగిరిరావు, ఎంఇఒ పద్మావతి లతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండలంలో విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ రిజిస్ట్రేషన్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రాప్‌అవుట్స్ విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించాలని అన్నారు. విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ వంద శాతం వెంటనే పూర్తి చేయాలన్నారు. తరగతుల వారీగా ఎన్రోల్మెంట్ పై ఎంఇఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను గుర్తించాలన్నారు. అంగన్వాడీ నుంచి ఒకటవ తరగతిలోకి, 6,7,8,9,10 తరగతిలోకి పూర్తిగా చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. పదవ తరగతి ఫెయిల్ లైన విద్యార్థులను తిరిగి పదిలో చేర్పించాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్నం భోజనం, జగనన్న విద్యా కానుక వంటి రాయితీలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశలో చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగేలా వాళ్లని తల్లిదండ్రులతోపాటు, ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా జిఇఆర్‌ను వంద శాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసు కోబడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేషగిరిరావు, ఎంఇఒ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు, ఎడ్యుకేషన్‌వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం 1,2 గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఎంపిడిఒ శేషగిరిరావు సచివాలయ కార్యాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డిఎల్‌డిఒకు వివరించారు. ఉద్యోగుల హాజరు పట్టికను, పలురికార్డులను, మూమెంట్ రిజిస్టర్‌లను, ప్రభుత్వ పథకాలఅర్హుల, అనర్హుల జాబితాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ

ప్రజాశక్తి-కలికిరి



మాట్లాడుతున్న కెవికె కో-ఆర్డినేటర్ పాండురంగ

రైతుల అభివృద్దే లక్ష్యంగా ప్రధానమంత్రి పిఎం కిసాన్ క్రింద రైతులకు నగదు అందజేస్తున్నారని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. గురువారం కె.వి.కె కలికిరి నందు ప్రధానమంత్రి కిసాన్ సమ్మేళన్ కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మేళన్ కార్యక్రమం ప్రత్యక్షంగా ప్రసారం చేశారు. ప్రధానమంత్రి 8.5 కోట్ల మంది అర్హులైన రైతులకి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున 17 వేల కోట్లు విడుదల చేశారు. రూ.1.25 లక్షల పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలు జాతికి అంకితం చేశారు. డాక్టర్ జి.ఎస్.పాండురంగ, సమన్వయకర్త పిఎం కిసాన్ సమ్మేళన్, పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల గురించి రైతులకు వివరించారు. పిఎం కిసాన్ నిధులతో వ్యవసాయం చేసి అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శేషకిరణ్, శాస్త్రవేత్త ఉద్యాన పంటలలో చీడపీడల యాజమాన్య పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు కంది, వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్.పాండురంగ, శాస్త్రవేత్తలు డాక్టర్ శేషకిరణ్, రైతులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకం మహిళలకు వరం : టిడిపి

ప్రజాశక్తి-నందలూరు




మేనిఫెస్టో పత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మహాశక్తి పథకం మహిళలకు వరంలాం టిదని ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ ఎద్దులసుబ్బరాయుడు, మండలాధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్యలు పేర్కొన్నారు. గురువారం నందలూరు గ్రామపంచాయతీలో పార్లమెంటరీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, అనసూ యమ్మ, తాటిలక్ష్మిదేవి ఆధ్వర్యంలో మహాశక్తి మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ మహిళల కోసం ఆడబిడ్డనిధి, తల్లికి వందనం, దీపం పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత పథకం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, పూర్ టు రిచ్ పథకం ద్వారా ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు చేసేందుకు టిడిపి కృషి చేస్తుందని అన్నారు. కార్యక్ర మంలో గ్రామపంచాయతీ సర్పంచ్ మోడపోతుల సుభాషిని, మహిళ నాయకురాలు షర్మిల, మిరియం జ్యోతి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రేవూరి వేణుగోపాల్, టిడిపి నాయకులు గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, మోడపోతుల రాము, గుండు సురేష్, జ్యోతి, శివ, గంగాధర్, నారపుశెట్టి శివ, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, తాటి సుబ్బరాయుడు, చుక్క యానాది, పాటూరు రమేషు, గంగనపల్లి శీను, గౌస్ బేగ్, మాభాష, ఉప్పు శెట్టి రెడ్డయ్య, రాజా, మేస్త్రి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సిఎం ధ్యేయం :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

రాజకీయ పార్టీలకు అతీతంగా పేదల సంక్షేమమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోసువారిపల్లె పంచాయతీలోని కొప్పులోలపల్లి, గుమ్మడికాయలపల్లి, ఎర్రోళ్లపల్లి, ఆనిగానిపల్లి, వడ్డేపల్లి, చిట్కలపల్లి, పాయిలోలపల్లి, పెద్దగుట్టపల్లి, సింగారెడ్డి గారివారి పల్లి, నల్ల తిమ్మారెడ్డి గారిపల్లి, చిన్నరెడ్డివారి పల్లెల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో ప్రభుత్వ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సుపరిపాలన కోసం మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి రఘునాథ్, ఎంపిటిసి సభ్యురాలు శ్యామల కోటిరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి, రామ్మూర్తి, శివారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహమ్మద్‌ఖాన్

గౌరవ వేతనానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.ఐదు వేలు వచ్చే గౌరవ వేతనాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం ముస్లిం మైనార్టీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముస్లిం సోదరులకు, మసీద్ కమిటీ ప్రెసిడెంట్లు, సెక్రెటర్‌లకు వక్ఫ్ బోర్డు 271 మసీదులకు గౌరవ వేతనములు ప్రతినెలా మసీదు ఖాతాకు చెల్లిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో గౌరవ వేతనం పొందని 99 మసీదుల ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు దరఖాస్తులు తీసుకొని విజయవాడ వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి చేర్చాలన్నారు. ప్రభుత్వం నుండి గౌరవ వేతనములు పొందుతున్న మసీదులు, దరఖాస్తులు ఇచ్చిన మసీదులు కాకుండా ఆదాయం లేని, దరఖాస్తులు సమర్పించని మసీదుల ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు గౌరవ వేతనములు పొందుటకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఫయాజూర్ రహ్మాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ నవరంగ్ నిసార్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జాఫర్ అలీఖాన్, కౌన్సిలర్లు రౌనక్, సబ్బీర్, నాయకులు రియాజ్, సుగావాసీ శ్యాం, గువ్వల బాలాజీ, రవి, అయ్యవారెడ్డి, ఖాదర్ వలీ, గోపాల్‌రెడ్డి, దేవేంద్ర కుమార్, రహంతుల్లాఖాన్, అబ్బాస్, అమీర్, జావేద్, బేపారి జాబివుల్లాఖాన్, నిసార్, రిజ్వాన్ పాల్గొన్నారు.

ఓటు సవరణలకు అవకాశం

పుల్లంపేట : మండల పరిధిలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం మండలంలోని విఆర్‌ఒలు, బిఎల్ఒలతో తహశీల్దార్ నరసింహకుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు, విఆర్ఇలు ప్రతి ఇంటిలోని ఓటును క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ కార్డులో డోర్ నెంబర్, తండ్రి పేరు, అడ్రస్ తదితర వాటిలో పొరపాటులు దొర్లి ఉంటే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ద్వారా సవరణలు చేసుకోవడానికి అవకాశ ముందని తెలిపారు.ఇంటింటి సర్వేలో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన మధుబాబు

మదనపల్లె అర్బన్ : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడును పట్టణానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాటకొండ మధుబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని కేంద్ర టిడిపి కార్యాలయంలో ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, పార్టీ బలోపేతంపై ఇద్దరూ కాసేపు చర్చించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆయన పలు సూచనలు సలహాలు ఇచ్చారన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళర్పిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

ఘనంగా ఎపిజె అబ్దుల్‌కలాం వర్ధంతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారత క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్‌కలాం 8వ వర్ధంతిని గురువారం పట్టణంలోని స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారిలు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా చేసిన నిర్వి రామ కృషి, ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. తన మేధోసంపత్తితో ఎన్నో క్షిపణులను తయారుచేసి భారతనిని బలీయమైన శక్తిగా తయారు కావడానికి దోహదపడ్డారన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది భవిత, నరసింహులు, రమేష్, ఆది, ఉబేదుల్లా, దివ్యాంగుల కేంద్రము సిబ్బంది, స్థానిక నాయకులు నక్కామహేష్, సంకుసబ్జి, పవన్‌రాయల్, పండు, విద్యార్థులు పాల్గొన్నారు. **చిట్వేలు :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి ట్రూప్ విద్యార్థులు ,ట్రూఫ్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్ రాజు, ఎన్సిసి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** నేటి సమాజంలో యువత దివంగత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్‌అర్ విద్యార్థి భాగం నాయకుడు మలతొట్టి నరేష్ తెలిపారు. పీలేరు శ్రీ మేధ జూనియర్ కళాశాలలో వైఎస్‌అర్ విద్యార్థి భాగం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేష్, అస్లాం బాష, గిరి వర్ధన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా వెల్ విషర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కలాం విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమాదేవి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కలాం సేవలు ఈ దేశ పురోగతి కి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. కార్యక్రమం లో వెల్ విషర్స్ సభ్యులు అరుణ్, మనోహార్, కృష్ణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, అజ్మతుల్లాఖాన్, లక్ష్మీపతి, జ్ఞానేంద్ర, నరసింహులు, మురళీకృష్ణ , చలపతి, విజయ , హరిబాబు, బాలు, వినయ్, గిరీష్ పాల్గొన్నారు.



పీర్ల చావిడి వద్ద నిర్వాహకులతో చమర్తి జగన్మోహన్‌రాజు

మొహర్రం వేడుకల్లో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని నాగులుమానువీధిలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో నియోజకవర్గ టిడిపినాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరుసుధాకర్, మాజీ టిడిపి పట్టణ అధ్యక్షులు సంజీవరావులతో కలిసి పాల్గొన్నారు. నిర్వాహకులు మంగళ వాయిద్యాలతో, బాణాసంచా కాలుస్తూ వారికి ఘనస్వాగతం పలికారు. పీర్ల చావడి వద్ద ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమంలో పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హసన్, హుస్సేన్‌ల త్యాగ ఫలితమే మొహర్రం అని అన్నారు. వారిని స్మరించుకుంటూ వేడుకలు చేసు కోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బండారు బాలయ్య, రామ్మోహన్, మహేంద్ర, సూర్యనా రాయణ రాజు, శేషారెడ్డి, వెంకటేష్ యాదవ్, నాగేంద్ర, తెలుగు యువత పట్టణ ప్రధాన కార్యదర్శి సుహేల్, పార్లమెంట్ మైనారిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మండెం కరి ముల్లా, పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు దాసరి వాణి శంకర్ పాల్గొన్నారు.

పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటా..

రాజంపేట అర్బన్ : పెద్దకారం గ్రామంలో ఐటి చేసి అమెరికా వెళ్లాలనుకునే ఆశావకులకు స్పాన్సర్‌షిప్ అందజేసి పుట్టిన ఊరు రుణం తీర్చుకుంటానని ఎన్‌ఆర్ఐ కె.కెరెడ్డి పేర్కొన్నారు. రాజంపేట మండల కేంద్రంలోని పెద్దకారంపల్లెకు చెందిన మన్నూరు రామలక్ష్మమ్మ, నారాయణరెడ్డిల కుమారుడు ప్రముఖ ఐటీ సంస్థలైన టువంటి హెచ్‌ఆర్ పండిట్, గ్యాన్టెక్ఇపబ్లిసింగ్, ఈ-బుక్స్‌టుగో, ప్రోవేస్ సంస్థల సిఇఒ, ప్రెసిడెంట్ మన్నూరు కే.కే రెడ్డి తన స్వగ్రామము పెద్ద కారంపల్లికి వచ్చిన సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడారు. రాబోవు 2024 అమెరికా వీసా కోటాలో అమెరికా వెళ్లాలనుకునే పెద్దకారంపల్లె పంచాయితీకి చెంది నటువంటి ఐటి రంగ నిపుణులకు తమ ఫౌండేషన్ స్పాన్సర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. భావితరాల ఐటి ఆశావహులకు తాను ఒక మూల స్తంభంగా ఉంటా నన్నారు. తమ గ్రామంలో రెండు రోజులు ఎవరైనా వ్యక్తిగతంగా సంప్రదించాల నుకుంటే కలవవచ్చని తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

చిట్వేలి : ఓబులవారిపల్లె మండలానికి చెందిన విష్ణు అనే వ్యక్తి మూడు రోజుల క్రితం విద్యుత్ ఘాతానికి గురైన తీవ్రంగా గాయ పడ్డాడు. తన తండ్రితో కలిసి పొలంలో ఉన్న మోటా ర్‌కు మరమ్మతులు చేస్తుం డగా దగ్గరలో ఉన్న 11 కెవి విద్యుత్ వైరు తగిలి రెండు కాళ్లు పూర్తిగా కాలిపోయి ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మల్లం హేమంత్ కుమార్, ఓలేటి రెడ్డయ్య చౌదరి, గొల్లపూటి శివ నారాయణ చౌదరి, పెద్దపల్లి బాలసు బ్రమణ్యం, మల్లంశంకర్, శిల్పారెడ్డిలు మానవత దృక్పథంతో వైద్య ఖర్చులకై రూ.1.16లక్షలు ఆర్థిక సాయం చేశారు.

జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పుంగనూరు రోడ్డులోని మిషన్ కాంపౌండ్ గ్రౌండ్‌లో జరిగిన సబ్ జూనియర్ ఫుట్ బాల్ బాలుర, బాలికల జిల్లా సబ్ జూనియర్ ఫుట్ బాల్ జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ సభ్యులు కందూరు మురళీధర్ తెలిపారు. జిల్లా నలు మూలల నుండి సుమారు 120 మంది బాల బాలికలు పాల్గొన్నారు. క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులు మాజీ చిత్తూరు జిల్లా కార్యదర్శి కీ.శే. గిరిరావుని స్మరిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో జాన్ కమలేష్, షఉటింగ్ బాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు భద్రయ్య, చెన్నకేశవ, మహేంద్ర, విజయ్, భాను, ఆంజనేయులు, అంజయ్య, రెడ్డి శేఖర్, అరుణ్ నాయక్, పాల్గొన్నారు.

మస్టర్‌లో కూలీల పేరు తప్పకుండా ఉండాలి

ప్రజాశక్తి-గాలివీడు



మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎపిఒ హరిప్రసాద్

ఉపాధి హామీ పథకం కింద కూలికి వెళ్లే ప్రతి ఒక్కరి పేరు మస్టర్‌లో తప్పక నమోదు చేయాలని ఎపిఒ హరి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం తూము కుంట ఎలాన్‌చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పను లను కూలీలను మస్టర్లను తనిఖీ చేశారు. తుమ్ముకుంట గ్రామంలో 150 మంది కూలీలు రోజు ఉపాధి పనిలో పాల్గొన్నారని తెలిపారు. కూలీలకు ఉపాధి కల్పించడానికి మస్టర్‌లో పేరు నమోదు చేపించి ఇంకా కూలీల సంఖ్యను పెంచాలని ఎఫ్‌ఎ రమణారెడ్డిని ఎపిఒ ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎఫ్‌ఎ పాల్గొన్నారు.